క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి వనరులను సృష్టించుకోవాలి



పోనకలదిన్నెలో వనరుల చిత్రం ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నందవరం: ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి వనరులను సృష్టించుకోవాలని రిలయన్స్, ఆర్డిప్ సంస్థ కార్యకర్త కరుణప్ప పేర్కొన్నారు. సోమవారం పోనకలదిన్నె గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామ వనరుల గుర్తింపు- ప్రణాళిక కార్యక్రమం చేపట్టారు. అనంతరం గ్రామ పటం ద్వారా వనరులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనరుల పటం ద్వారా గ్రామంలో వ్యవసాయ అనుబంధ జీవనోపాధులు, భౌగోళిక వనరులు, నీటి వనరులపై అవగాహన కల్పించామన్నారు. అలాగే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చెట్లను పెంచడం, భూగర్భ జలాలు పెంచడం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని, పెట్టుబడులు తగ్గించి నాణ్యమైన దిగుబడులు పొందేలా చేయడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని వీఏఏ రహీమ పేర్కొన్నారు. ఆర్డిప్ కార్యకర్త ఉసేని, గ్రామస్తులు పాల్గొన్నారు.

శరవేగంగా విద్యుత్ నవీకరణ పనులు

మద్దికెర: మండలంలో అంతరాయం లేకుండా విద్యుత్ అందించేందుకు చేపట్టిన నవీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఏఈ మహేష్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రెండు ఫీడర్లు ఏర్పాటు చేస్తున్నామని అందులో భాగంగా నూతనంగా వైర్లు, స్తంభాలు మార్చుతున్నామన్నారు. ఫీడర్లు ఏర్పాటు చేయడం వల్ల మద్దికెరలో నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుంటుందన్నారు.

ఆర్బీకే తనిఖీ



నిట్రవట్టి ఆర్‌బీకేలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ శివశంకర్

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి, విరుపాపురం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి శివశంకర్ తనిఖీ చేశారు. కార్యాలయాల్లో ఎరువులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. సిబ్బంది హాజరు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు, ఎరువులను అందించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్బీకే సిబ్బంది వెంట ఉన్నారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టి ఫీజులు పేద, మధ్య తగతి వారికి అందుబాటులో ఉండేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్, ఉదయ్‌కుమార్, శేఖర్ నాయుడు, సురేష్, ఆఫ్రిద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీడీఎస్‌యూ, యూఎస్‌ఎఫ్‌ఐ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సమాఖ్య, ఆర్‌పీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో వివిధ రకాల బుక్స్, డ్రస్సులు, ఫీజుల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రులను యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. ఆయా పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

1,620 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల పంపిణీ

కృష్ణగిరి: మండలంలోని అన్ని ఆర్‌బీకేల ద్వారా ఇప్పటివరకు 1,620 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు ఏఓ ఎస్.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే విత్తనాలు అందిస్తామన్నారు. విత్తనాలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా అదే పంటను సాగు చేయాలని, విత్తనాలను దళారులకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పంటల సాగు పనులు ప్రారంభమయ్యాయని విత్తనం వేసేముందు శుద్ధి చేయాలని సూచించారు. మండలంలోని కటారుకొండలో 279 క్వింటాళ్లు, ఎరుకలచెర్వులో 250 క్వింటాళ్లు, కోయిలకొండ, చిట్యాల గ్రామాల్లో కూడా 200 క్వింటాళ్లకుపైగా వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. విత్తనాలు అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో తీసుకోవాలని సూచించారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

తుగ్గలి: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ రవి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ముక్కెల్లకు చెందిన అటక చిన్న మునెప్ప ఆయన సోదరులు తమ భూ సమస్య పరిష్కరించాలని, మరొకరు భూమి కొలతల కోసం అర్జీ ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

నిధులు సమృద్ధి..
శరవేగంగా అభివృద్ధి

- మద్దికెర మండలంలో రూ.27.89 కోట్లతో అభివృద్ధి పనులు
- గ్రామాల్లో అందుబాటులోకి వస్తున్న మౌలిక వసతులు
- శరవేగంగా నిర్మాణ పనులు
- సిమెంటు రోడ్ల ఏర్పాటుతో కాలనీలు కళకళ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



రాంనగర్‌లో వేసిన సీసీ రోడ్డు

మద్దికెర: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ సౌకర్యాలు కల్పిస్తోంది. గడప వద్దకే పాలన లక్ష్యంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించడంతో పాటు గ్రామాల్లో తగినన్ని నిధులు కేటాయించి అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తోంది. దీంతో పల్లెలు ప్రగతి బాట పడుతున్నాయి. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు భవన నిర్మాణాలతో పాటు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్లు, తారు రోడ్లు త్వరితగతిన పూర్తి చేసుకొని ఒక్కక్కటిగా అందుబాటులోకి వస్తుండడంతో మండలంలో అభివృద్ధి రయ్ రయ్ మంటూ పరుగులు పెడుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సైతం మంచి ఫలితాలను ఇస్తోంది. గతంలో ఎవరూ చేయని విధంగా ఎమ్మెల్యేతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇంటింటికీ వెళ్లి నేరుగా ప్రజలతో మమేకమవుతున్న తీరుపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకొని తగినన్ని నిధులు మంజూరు చేసి పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోంది. ఇప్పటికే మండలంలో అన్ని గ్రామాలలో సచివాలయాలు పూర్తి కాగా హంప, మద్దికెర-2 సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణ దశలో ఉన్నాయి. మండలంలో 11 గ్రామాలు, 8 పంచాయతీలు, 36,834 మంది జనాభా ఉన్నారు. ప్రజల సౌకర్యార్థం మండలంలో రూ.27.89 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో కొన్ని పూర్తి కాగా మరికొన్ని పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మద్దికెర, ఎం.అగ్రహారం, పెరవలి, ఎడవలి గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. 791 ఇళ్లు మంజూరు కాగా ఎడవలి గ్రామంలో పూర్తి స్థాయిలో ఇళ్లు నిర్మించుకున్నారు.



నాడు-నేడు పథకం ద్వారా దశ మారిన కస్తూర్బా విద్యాలయం



రూ.45లక్షలతో నిర్మించిన సచివాలయం

ఎమ్మెల్యే సహకారం మరువలేనిది



మండలంలోని అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆయా సమస్యలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పనులు చేపట్టేందుకు తగినన్ని నిధులు మంజూరు చేయిస్తున్నారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం.
– మురళీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ, మద్దికెర

వేగవంతంగా నిర్మాణ పనులు



మండలంలో సుస్థిర అభివృద్ధి పనులను లక్ష్యం మేరకు చేపడుతున్నాం. గ్రామ సచివాలయాలు, ఆర్బీకే భవనాల నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తున్నాం. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రూ.25 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నాం.
– అనిత, ఎంపీపీ, మద్దికెర

మద్దికెర మండలంలో అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల వివరాలు

సచివాలయాలు	9	రూ.3.60 కోట్లు
ఆర్బీకేలు	9	రూ.1.96 కోట్లు
హెల్త్ క్లినిక్‌లు	9	రూ.1.53 కోట్లు
సీసీ రోడ్లు	-	రూ. కోటి
మద్దికెర-బొజ్జనాయునిపేట తారు రోడ్డు	-	రూ. 2.75 కోట్లు
కొత్తపల్లి	-	రూ. 27 లక్షలు.
బీఎన్‌పేట	-	రూ. 8 లక్షలు.
బురుజుల	-	రూ.10 లక్షలు
జల్‌జీవన్ మిషన్ పనులు	-	రూ.45 లక్షలు
ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మౌలిక సౌకర్యాల కల్పన	-	రూ.1.80 కోట్లు
బురుజుల-మద్దికెర ప్యాచ్ వర్క్స్ పనులు	-	రూ.40 లక్షలు
మదనంతపురం గ్రామంలో పైపులైన్	-	- రూ.5 లక్షలు
జెడ్పీ గ్రాంట్ నాడు- నేడు పాఠశాల అభివృద్ధి పనులు		రూ.2.50 కోట్లు
కస్తూర్బా విద్యాలయంలో అదనపు గదులు		రూ.90 లక్షలు
మద్దికెర రాంనగర్‌లో సీసీ రోడ్లు	-	రూ.53 లక్షలు
జలజీవన్ మిషన్ కింద-		రూ.6.54 కోట్లు
ప్రభుత్వ కార్యాలయ చుట్టూ ప్రహరీ.	-	రూ. 25 లక్షలు
హంపలో పైపులైన్ కొరకు జెడ్పీ గ్రాంటు	-	రూ. 5 లక్షలు
మదనంతపురం ఎంఐ ట్యాంకు అభివృద్ధి	-	రూ.3.38 కోట్లు
మొత్తం		రూ. 27.89 కోట్లు

'నవరత్నాలు' దేశానికే ఆదర్శం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: రాష్ట్రంలో అమలుచేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం స్థానిక సాయినగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కాలనీలో డ్రైనేజీతోపాటు సీసీ రోడ్లు వేయించాలని స్థానికులు కోరగా తప్పనిసరిగా వేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాలను ప్రజలకు వివరించారు. నాడు సంక్షేమ పథకాల కోసం పడిన అవస్థలను గుర్తు చేస్తూ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటివద్దకే పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని హేళన చేసిన మాజీ సీఎం చంద్రబాబు ఇప్పుడేమో అంతకన్నా మెరుగైన పథకాలు అందిస్తానని హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని, ఆయన మోసపూరిత హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, విజయుడు, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓపీఆర్డీ మద్దిలేటిస్వామి, సలహాదారు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాలతో 'జగనన్న గోరుముద్ద'



విద్యార్థినులకు రాగిజావ అందిస్తున్న ఏడీ శామ్యూల్ పాల్

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం కింద పోషకాలతో కూడిన ఆహారం అందిస్తున్నట్లు ఎండీఎం ఏడీ శ్యాముల్ పాల్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంతో పాటు రాగిజావ తయారీని పరిశీలించారు. విద్యార్థినులకు రాగిజావ అందజేసి వారితో పాటు రుచి చూశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాశాఖ నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచి, శుచితో కూడిన మధ్యాహ్న భోజనం వడ్డించాలని వంట ఏజెన్సీ వారికి సూచించారు. ఎంఈఓ ఆంజినేయులు, హెచ్‌ఎం కృష్ణమూర్తి వెంట ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ విజయ్‌కుమార్

హాలహర్వి: అర్దగేరి గ్రామ శివారులోని హత్తిబెళగల్ క్రాస్ రోడ్డులో సోమవారం ఆలూరు మండలం హత్తిబెళగల్‌కు చెందిన ఖాదర్‌బాషా అనే వ్యక్తి కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి ఆరు బాక్సుల్లోని 528 మద్యం టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్ పరిమాణం గలవి) స్వాధీనం చేసుకుని బైకును సీజ్ చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలించినా, విక్రయించినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

వెల్దుర్తి: కోడుమూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ బృందం, స్థానిక పోలీసులు సోమవారం వెల్దుర్తి మండలంలో నిర్వహించిన సోదాలలో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల మేరకు.. గోవర్ధనగిరిలో జరిపిన సోదాల్లో మద్దమ్మ వద్ద నుంచి, ఎల్ నగరంలో జరిపిన సోదాల్లో అయ్యస్వామి వద్ద నుంచి 46 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను డోన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి



హులేబీడులో వేరుశనగ విత్తనాలు అందిస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన విత్తనాలనే వాడాలని ఆలూరు ఏడీఏ సునీత సూచించారు. సోమవారం స్థానిక ఆర్బీకే-2లో రైతులకు వేరుశనగ లేపాక్షి బ్రాండ్ ఫ్రీ కిట్ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సబ్ డివిజన్‌లోని 5 మండలాలకు ఉన్నతాధికారులు 30 కిట్లను సరఫరా చేశారన్నారు. మండలానికి 6 కిట్లు చొప్పున కేటాయించగా ఉత్తమ రైతులను ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నామన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు రైతులు తమ పొలంలో 10 శాతం భాగంలో వేరుశనగ లేపాక్షి బ్రాండ్ విత్తనాలతో పంట సాగు చేసి ఎంతమేర దిగుబడి వచ్చిందో తెలియజేస్తారని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు ఆయా ఆర్బీకేల పరిధిలో విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఆర్బీకే పరిధిలో 10 మంది రైతుల పొలాలను ఎంచుకుని మట్టి నమూన పరీక్షలు చేస్తున్నామన్నారు. ఈ నెల 20 లోపు నమూనాల సేకరణ పూర్తిచేస్తామని తెలిపారు. ఆలూరు వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ గౌడ్, రైతులు, ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: పత్తి పంట సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా జల వనరుల ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏడీఏ ప్రవీణ్ సూచించారు. వారు సోమవారం సోగనూరు ఆర్బీకేలో పత్తి పంట సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు వ్యవసాయ శాఖ అనుమతి కలిగిన విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనశుద్ధి తప్పని సరిగా చేయాలన్నారు. ఏఓ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: ఎరుకలచెర్వు గ్రామంలోని ఎస్సీ హాస్టల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్ కోసం ట్యూటర్లతో శిక్షణ, ప్రతి నెలా కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడంతో పాటు ఉచితంగా దుప్పట్లు, ట్రంకు పెట్టెలు, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆలయ భూమి కౌలుకు వేలం

తుగ్గలి: ఎద్దులదొడ్డి వీరభద్రేశ్వర స్వామి ఆలయ భూముల కౌలుకు సోమవారం ఎండోమెంట్ అధికారి గుర్రెడ్డి వేలం నిర్వహించారు. స్వామి ఇనాం భూమి 29.32 ఎకరాలను ఏడాది పాటు కౌలుకు సాగు చేసుకునే హక్కులను వేలం పాటలో గ్రామానికి చెందిన రంగస్వామి రూ.76 వేలకు దక్కించుకున్నారు.

నేడు జాబ్‌మేళా

మద్దికెర: పత్తికొండలోని డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మధుబాబు సోమవారం తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు రెండు ఫొటోలు, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ట్రాక్టర్ బోల్తా

వెల్దుర్తి: కలుగొట్ల గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద డౌన్ రోడ్‌లో చెరువు మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ సోమవారం అదుపుతప్పి బోల్తా పడింది. నర్సాపురానికి చెందిన ట్రాక్టర్ బ్రహ్మగుండం వద్ద ఎర్ర చెరువులోని పూడిక మట్టి లోడుతో ఉయ్యాలవాడ వైపు వెళ్తుండగా డౌన్ రోడ్‌లో అతివేగంగా దూసుకెళ్లడంతో బోయనపల్లెకు చెందిన యువ డ్రైవర్ అదుపు చేయలేకపోయాడు. దీంతో ట్రాక్టర్ పల్టీ కొట్టింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఇద్దరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని చెన్నాపురం గ్రామ మలుపు వద్ద సోమవారం ఎమ్మిగనూరుకు వస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఆర్ మురహర రెడ్డి వాహనాన్ని ఆదోని వైపు వెళ్తున్న స్కూటర్ ఢీకొనడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్కూటర్ కారును ఢీకొట్టడంతో కారు టైరు పేలిపోయింది. కారులో ఉన్న మురహర రెడ్డికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. గాయపడిన ఇద్దరు యువకులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఈరోజు

మద్దికెరలో గడప గడపకు మన ప్రభుత్వం
మద్దికెర: మండలంలో మంగళవారం సాయంత్రం 3:30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, వలంటీర్లు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

గోనెగండ్లకు ఎమ్మెల్యే రాక
గోనెగండ్ల: మండల కేంద్రానికి మంగళవారం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి వస్తున్నట్లు సింగిల్‌విండో అధ్యక్షుడు కాశీవిశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గోనెగండ్ల సహకార సంఘం ఆవరణలో రూ.11.75 లక్షలతో నిర్మించిన షాపులను ప్రారంభించేందుకు ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి వస్తున్నట్లు తెలిపారు. రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు
హొళగుంద: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన శ్రీవిజయేంద్ర తీర్థుల 409వ ఆరాధన మహోత్సవాలు మంగళవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. వేడుకలో భాగంగా ఈ నెల 15న పూర్వారాధన, 16న మధ్యారాధన, 17న ఉత్తరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భజన కార్యక్రమంతో పాటు స్వామి వారికి పంచామృత, తులసి అర్చన, నైవేద్యం, ప్రవచన, భజన, స్వస్తివాచన, మహా మంగళహారతి, స్వామి వారి రథోత్సవం తదితర కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయని ట్రస్టు సభ్యులు తెలిపారు.

ప్రతి గడపకు సంక్షేమ లబ్ధి



ఎమ్మిగనూరు 32వ వార్డులో వృద్ధురాలి సమస్యలు వింటున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని 32వ వార్డులో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ కోటకొండ నరసింహులు తదితరులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు పరిధిలో కొన్ని వీధుల్లో సీసీ రోడ్లు తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా ఆరు నెలల్లోగా పనులు పూర్తి చేస్తామని, ఆ మేరకు సత్వర చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను సూచించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టా రంగయ్య, కార్యదర్శి వీరేంద్ర, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మురిపించిన మామయ్య కానుక



దేవనకొండ ఎంపీపీ పాఠశాలలో విద్యాకానుక కిట్లను పంపిణీచేసిన జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ



ఎరుకలచెరువు జెడ్పీ హైస్కూల్లో కిట్లను అందజేస్తున్న సర్పంచ్ ప్రవీణ్ తదితరులు



గోనెగండ్లలో కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ టీ. నసురుద్దీన్

సాక్షి నెట్‌వర్క్: వేసవి సెలవులు ముగియడంతో సోమవారం ఉదయం బడి గంట మోగింది. ఉత్సాహంగా పాఠశాలలకు చేరుకున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుక సంతోషాన్ని రెట్టింపు చేసింది. ప్రభుత్వం అందించిన విద్యాకానుక కిట్లలోని వస్తువులను చూసుకుని విద్యార్థులు మురిసిపోయారు. డివిజన్ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో విద్యార్థులకు తొలిరోజే కిట్లను పంపిణీ చేశారు. తమపై భారం పడకుండా పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు కానుక అందించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల చదువులకు సీఎం జగన్ మామయ్యలా అండగా ఉన్నారని కొనియాడారు. వెల్దుర్తి హరిజన వాడ ఎంపీపీ స్కూల్‌లో కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. హెచ్‌ఎం సరస్వతి, పీఎంసీ చైర్మన్ సావిత్రి ఆధ్వర్యంలో బ్లాక్ బోర్డుపై జేవీకే-4 పంపిణీ ఫ్లెక్సీకి మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. విద్యార్థులు, తల్లితండ్రులు హాజరుకాగా బ్యాగ్, పుస్తకాలు, డ్రస్సులు, బూట్లు వగైరా విద్యా సామగ్రి అందించారు.

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ కె.ఆంజనేయులు

ఎమ్మిగనూరురూరల్: ఎమ్మిగనూరు తహసీల్దార్‌గా కె.ఆంజనేయులు సోమవారం రాత్రి 8 గంటలకు బాధ్యతలు చేపట్టా రు. ఇక్కడ విధులు నిర్వహిస్తు న్న తహసీల్దార్ జయన్న కోడుమూరుకు బదిలీ కాగా చిప్పగిరిలో పనిచేస్తున్న ఆంజనేయులు బదిలీపై ఎమ్మిగనూరుకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. కురవ సంఘం నాయకులు తహసీల్దార్‌ను పూలమాలతో సన్మానించారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

మద్దికెర: మండలంలోని గ్రామాలను శుభ్రంగా వుంచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి సూచించారు. ఆయన సోమవారం పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని డ్రైనేజీలు, రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు చేపట్టాలని. కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడమే గాకుండా దోమల నివారణ మందులు పిచికారీ చేయాలని సూచించారు.

ఎరువుల దుకాణాల్లో అక్రమాలు అరికట్టాలి

పత్తికొండ రూరల్: ఎరువుల దుకాణాల్లో అక్రమాలను అరికట్టాలని కోరుతూ బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు సోమవారం స్పందన కార్యక్రమంలో ఆర్డీఓ మోహన్‌దాస్‌కు వినతి పత్రం అందజేశారు. కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సిసి.రంగన్న, మండలాధ్యక్షుడు శంకరయ్యాచారి మాట్లాడుతూ.. ఎరువుల దుకాణాల్లో ధరల పట్టిక ప్రదర్శించకుండా రైతుల నుంచి అధిక మొత్తం వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ అధికారులు తనిఖీ చేపట్టి అక్రమాలకు పాల్పడుతున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు భాస్కర్, లక్ష్మణస్వామి, సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



తహసీల్దారు హుసేన్ సాహెబ్‌కు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

హొళగుంద: గుంతలు పడి అధ్వానంగా ఉన్న ఢణాపురం-హొళగుంద రోడ్డును బాగుచేసే వరకు ఉద్యమం ఆగదని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం ఢణాపురం-హొళగుంద రోడ్డు నిర్మాణ సాధన కోసం ఏర్పడిన జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. అంతకుముందు సమావేశమైన గవి సిద్ధప్ప, కన్నారావు, హమీద్ తదితరులతో పాటు జేఏసీ నాయకులు భవిష్యత్తులో చేపట్టాల్సిన ఉద్యమ కార్యచరణపై చర్చించి రోడ్డు నిర్మాణ సాధనకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీపీ నూర్జహన్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, తహసీల్దారు హుసేన్‌సాహెబ్, సర్పంచ్ చలవాది రంగమ్మ తదితరులకు వినతి పత్రం ఇచ్చారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ఆలూరు రూరల్: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత వెలికితీసేందుకు గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు నిర్వహించినట్లు ఆలూరు వైస్ ఎంపీపీ శ్రీరాములు అన్నారు. సోమవారం మొలగవల్లి గ్రంథాలయంలో లైబ్రేరియన్ భాస్కర్ ఆధ్వర్యంలో వేసవి శిబిరం ముగింపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే కథలు, నవలలు,గ్రంథాలు చదవడం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

నందవరం: పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థులు జ్ఞానం పెంపొందించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ వై.శివరామప్రసాద్ ఆధ్వర్యంలో వేసవివిజ్ఞాన శిబిరం ముగింపోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసి స్వీట్స్, బహుమతులు పంపిణీ చేశారు.